సాక్షి సిద్దిపేట

ఆదివారం । 6 । ఏప్రిల్ । 2025



ఆట పూట మారిందోచ్..!

ఆటలు మానసిక ఉల్లాసాన్ని ఉత్తేజాన్ని కలిగిస్తాయి. కానీ, ఉద్యోగం, రోజువారీ పనులు ఇలా బిజీ లైఫ్‌తో గడిపేస్తూ మైదానాలకు వెళ్లలేక ఆటలకే దూరమైపోతున్న రోజులివి. వ్యాయామం కోసమో, క్రీడలపై ఆసక్తితోనో ఆటలాడేందుకు సమయం ఉండటంలేదు. అలాంటి వారికోసమే ఇప్పుడు రాత్రివేళల్లో సైతం ఆటాలాడేందుకు బాక్స్ గ్రౌండ్‌లు వెలిశాయి. ఆట రూపం మారకున్నా వేదికల రూపం మారుస్తూ ఆటలాడేందుకు అవకాశాన్ని కల్పిస్తున్నాయి. రాత్రి వేళల్లో సైతం క్రికెట్, బ్యాడ్మింటన్, స్నూకర్, టెన్నిస్ వంటి ఆటలు కూడా ఈ బాక్స్ గ్రౌండ్‌లో ఆడుకోవచ్చు. సంగారెడ్డి చుట్టుపక్క ప్రాంతాల్లో వెలిసిన ఇలాంటి బాక్స్ గ్రౌండ్‌లపై 'సాక్షి'ప్రత్యేక కథనం...

– మన్నె ప్రశాంత్ గౌడ్, సంగారెడ్డి టౌన్

న్యూస్‌రీల్

అంకిరెడ్డిపల్లి వాసికి డాక్టరేట్ పట్టా


తోట శారద

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లికి చెందిన తోట శారద పేదరికం, అంగవైకల్యాన్ని జయించి కాకతీయ యూనివర్సిటీలో డాక్టరేట్ పట్టానందుకున్నారు. ఆమెది పేద కుటుంబం. ఐత చంద్రయ్య సాహిత్యం సమగ్ర పరిశీలన అంశంపై యూనివర్సిటీలో పీహెచ్‌డీ పూర్తి చేసింది. శారీరక అంగవైకల్యం ఉన్నప్పటికీ డాక్టరేట్‌ను సాధించాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్లి పట్టాను దక్కించుకుంది. దీంతో గ్రామస్తులు శారదకు అభినందించారు.

శ్రీరామనవమికి నాచగిరి సిద్ధం

నేడు సీతారాముల కల్యాణం


కొలువుదీరిన శ్రీ సీతారామచంద్రమూర్తులు

వర్గల్(గజ్వేల్): సుప్రసిద్ధమైన నాచగిరి క్షేత్రంలోని శ్రీరామాలయం శ్రీరామనవమి మహోత్సవానికి ముస్తాబైంది. శ్రీలక్ష్మీ నృసింహుని గర్భగుడి చెంతనే గుహలో శ్రీ సీతాలక్ష్మణ సమేత రామచంద్రమూర్తి, ఆ పక్కనే ఆంజనేయ స్వామి కొలువుదీరారు. ఆదివారం శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకుని శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించేందుకు ఆలయ ప్రాంగణంలో విశాలమైన కల్యాణ వేదికను సిద్ధం చేశారు. ఉదయం 10.30 గంటలకు జగదభిరాముని కల్యాణోత్సవం జరుగుతుంది. భక్తజనులు కల్యాణ మహోత్సవ వైభవాన్ని ప్రత్యక్షంగా తిలకించి తరించాలని ఆలయ ఈఓ విశ్వనాథశర్మ కోరారు.

కొమురవెల్లి ఈవోగా అన్నపూర్ణ నియామకం

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ నూతన ఈవోగా అన్నపూర్ణను నియమించారు. ఈ మేరకు దేవాదాయశాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్‌లోని చిక్కడపల్లి వెంకటేశ్వర స్వామి దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్‌గా పని చేస్తున్న అన్నపూర్ణకు కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ ఈవోగా అదనపు బాధ్యతలను అప్పగించారు. ప్రస్తుతం ఆలయ ఈవోగా పని చేస్తున్న రామాంజనేయులును దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయానికి బదిలీ చేశారు. సోమవారం అన్నపూర్ణ బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం.

కొత్త పెన్షన్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తాం: చంద్రారెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కొత్త పెన్షన్ సవరణ బిల్లును తీసుకురావడంతో ప్రస్తుత పెన్షనర్ల హక్కులకు భంగం కలిగించే విధంగా ఉందని, అందువల్ల కొత్త పెన్షన్ సవరణ బిల్లును వ్యతిరేకిద్దామని విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చంద్రారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త సవరణతో భవిష్యత్‌లో పాత పెన్షన్ పొందుతున్న విశ్రాంత ఉద్యోగులను రెండుగా విభజించనున్నట్లు తెలిపారు. దీంతో పెన్షన్‌దారులకు ఇబ్బందులు ఉంటాయన్నారు. కేంద్రం వెంటనే కొత్త పెన్షన్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

మద్దతు ధర కల్పించాలి


మిల్లు ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

హుస్నాబాద్‌రూరల్: వడ్లకు ప్రభుత్వ మద్దతు ధర చెల్లించాలని రైతులు శనివారం రాత్రి ఆందోళనకు దిగారు. హుస్నాబాద్‌లో వ్యాపారులు రైతుల నుంచి పచ్చి వడ్లను కొనుగోలు చేస్తున్నారు. క్వింటాలుకు రూ.1,900లు చెల్లిస్తామని చెప్పిన వ్యాపారులు తూకం వేసిన తర్వాత రూ.1760లు చెల్లించడంతో రైతులు గోమాత మిల్లు ఎదుట ఆందోళనకు దిగారు. మద్దతు ధర రూ.2,330లు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ప్రజల అభ్యున్నతే ధ్యేయం

గజ్వేల్‌రూరల్: అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ పాలన సాగిస్తున్నదని ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని శ్రీగిరిపల్లిలో సన్నబియ్యం పంపిణీని శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు కుమార్, గణేశ్, కరుణాకర్, మహేశ్, నర్సింహులు, సురేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టానికి పరిహారమేదీ?

అకాల వర్షాలతో వందలాది ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు

- బీమా లేక ఏటా తప్పని ఇబ్బందులు
- రైతన్నను నిండా ముంచిన వర్షాలు


వర్గల్ మండలం మైలారంలో దెబ్బతిన్న మొక్కజొన్న పంట

గజ్వేల్: అకాల వర్షాలతో రైతులు నష్టపోవడం సహజ పరిణామంగా మారుతోంది. ఈనెల 3న కురిసిన వర్షాలకు జిల్లాలోని వందలాది ఎకరాల్లో ప్రధాన పంటలకు నష్టం జరిగింది. అధికారులు క్షేత్రస్థాయిలో నష్టం అంచనా వేసే పనిలో ఉన్నారు. అనంతరం ప్రభుత్వానికి నివేదికలు పంపినా.. పరిహారం అందుతున్న దాఖలాలు కనిపించడం లేదు. కనీసం పంటల బీమా పథకం అమలై ఉంటే రైతులకు కొంత ఉపశమనం కలిగేది. కానీ ప్రభుత్వం నుంచి పరిహారం రాక, బీమా సౌకర్యం అమలుకు నోచుకోక రైతులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారు. జిల్లాలో యాసంగి సీజన్‌కు సంబంధించి 3.52 లక్షల ఎకరాల్లో వరి, 22వేల ఎకరాల్లో మొక్కజొన్న, 11వేల ఎకరాల్లో పొద్దుతిరుగుడు, మరో 5వేల ఎకరాల్లో ఇంతర పంటలు సాగులోకి వచ్చాయి. పంటలు చేతికొచ్చే సమయంలో జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇటీవల కురిసిన అకాల వర్షం రైతుల ఆశలపై నీళ్లు చల్లింది. వరి, మొక్కజొన్న పంటలకు వందలాది ఎకరాల్లో నష్టం వాటిల్లింది. ప్రత్యేకించి గజ్వేల్ నియోజకవర్గంలో అకాల వర్షం తీవ్ర ప్రభావాన్ని చూపింది. వర్షం ధాటికి గెలలు కట్టిన వరి నేలవాలి వడ్లు పూర్తిగా రాలిపోయాయి. చేతికందే దశలో మొక్కజొన్న పంట సైతం నేలవాలి కంకులు దెబ్బతిన్నాయి. ఈ క్రమంలోనే ఒక్కో రైతుకు లక్షల్లో పంట నష్టం వాటిల్లింది. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొన్నది.

నివేదికలకే పరిమితం

అకాల వర్షాలు కురిసిన సందర్భంలో వ్యవసాయాధికారులు హడావిడిగా క్షేత్రస్థాయి పరిశీలనలు జరిపి ప్రభుత్వానికి నివేదికలు పంపడానికి పరిమితమవుతున్నారనే తప్పా.. పరిహారం మాత్రం అందటం లేదు. ఏటా ఇదే పరిస్థితి నెలకొంటున్నది. ప్రస్తుతం కూడా పంట నష్టం అంచనా వేసే పనిలో ఉన్నామని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

బీమా లేక వరుస నష్టాలు

రాష్ట్ర ప్రభుత్వం 'ఫసల్ బీమా' పథకాన్ని పునరుద్ధరించడానికి తీసుకున్న నిర్ణయం అమల్లోకి రాకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పంట నష్టానికి గురైన రైతులకు ఇక దేవుడే దిక్కు అనే పరిస్థితులు కూడా తలెత్తాయి. రైతులపై నయాపైసా భారం లేకుండా పంటల బీమా అమలు చేస్తామని ప్రభుత్వం గొప్పగా ప్రకటించింది. గతంలో ప్రీమియం భారం వల్ల కూడా రైతులు పెద్దగా ఈ పథకంలో చేరే వారు కాదు. నేడు అలా కాకుండా ప్రతి రైతుకు 'ఫసల్ బీమా'ను వర్తింపజేయడానికి ముందుకు సాగుతున్నామని కూడా ప్రకటించారు. ఇందుకోసం ఉమ్మడి జిల్లాల వారీగా కలెక్టర్లు ప్రత్యేక సమావేశాలను నిర్వహించి రైతుల అభిప్రాయాలను సేకరించి ప్రభుత్వానికి పంపారు. ఉమ్మడి మెదక్ జిల్లాకు సంబంధించిన సమావేశం సంగారెడ్డి కలెక్టరేట్‌లో 2024 మే 23న పూర్తి చేశారు. కొత్తగా అమలు చేయబోతున్న పథకంలో గతంలో ఉన్న మొక్కజొన్న పంటతో పాటు వరి పంటను కూడా గ్రామం యూనిట్‌గా తీసుకొని బీమా వర్తింపజేయడానికి సైతం నిర్ణయం తీసుకున్నారు. పత్తిని మండలం యూనిట్‌గా తీసుకోనున్నామని కూడా చెప్పారు. గతంలో ఉన్న బీమా చెల్లింపులకు ఇంకా మెరుగైన పద్ధతిని అమలు చేయాలనుకున్నారు. కానీ ఆచరణకు నోచుకోక రైతులు పంట నష్టానికి గురికావడం సహజ పరిణామంగా మారుతోంది.

మొక్కజొన్న పంట పూర్తిగా దెబ్బతిన్నది



మూడు రోజుల కిందట కురిసిన అకాల వర్షాల కారణంగా చేతికందిన పంటలు దెబ్బతిన్నయ్. ఎకరం పొలంలో మొక్కజొన్న సాగుచేసిన. విత్తనాలు, ఎరువులు, దున్నటం, డ్రిప్ తదితరాల కోసం రూ.20వేల వరకు పెట్టుబడి అయ్యింది. మరో 20రోజుల్లో పంట చేతికందుతుందనుకున్నా. ఈదురు గాలులతో కూడిన వర్షాల కారణంగా మొక్కజొన్న పంట పూర్తిగా దెబ్బతిన్నది. దీనివల్ల రూ. 60 వేల వరకు నష్టం వాటిల్లింది.

రైతు ఎక్కాల రమేష్,
జాలిగామ, గజ్వేల్ మండలం

రూ.2 లక్షల పంట నష్టం



నాకున్న రెండెకరాల్లో వరి సాగు చేసిన. గెలలు కట్టినంక అకాల వర్షాలు పడి వడ్లు రాలిపోయినయ్. మరో ఎకరంలో స్వీట్‌కార్న్ మొక్కజొన్న వేసిన. ఇది కూడా కంకులు వచ్చే టైమ్‌లో పూర్తిగా వెబ్బతిన్నది. మరో అర ఎకరం కీర పంట కూడా ఖరాబైంది. మొత్తంగా రూ.2 లక్షల పంట నష్టం జరిగింది.

రామికిష్టు రాజు,
సంగుపల్లి, గజ్వేల్ మండలం

సన్‌ఫ్లవర్ రైతులను ఆదుకోండి

మంత్రి తుమ్మలకు ఎమ్మెల్యే హరీశ్ విజ్ఞప్తి



సిద్దిపేటజోన్: సిద్దిపేట నియోజకవర్గం సన్‌ఫ్లవర్ రైతులను ఆదుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఎమ్మెల్యే హరీశ్‌రావు శనివారం ఫోన్ ద్వారా విజ్ఞప్తి చేశారు. చిన్నకోడూరు మండల రైతుల సమస్యలను తెలుసుకున్న హరీశ్.. మంత్రికి ఫోన్ చేసి పరిస్థితి వివరించారు. మండలంలోని రైతులు 18 వేల క్వింటాళ్ల దిగుబడి సన్‌ఫ్లవర్ సాగు చేసినట్టు పేర్కొన్నారు. అందులో 5 వేల క్వింటాళ్లు పీఏసీఎస్ ద్వారా, మరో 2 వేల క్వింటాళ్లు మార్కెట్ కమిటీ ద్వారా కొనుగోలు చేసినట్టు తెలిపారు. మిగతా 11 వేల క్వింటాళ్ల సన్‌ఫ్లవర్ మిగిలిందని, దీనితో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని పేర్కొన్నారు. వెంటనే కొనుగోలు కేంద్రాలను కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.

శ్రీరాముడు చూపిన మార్గం అనుసరణీయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఆదర్శప్రాయుడు శ్రీరాముడు చూపిన మార్గం మనందరికీ అనుసరణీయమని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. జిల్లా ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. హక్కుల కంటే బాధ్యత గొప్పదన్నది రామతత్వం, కష్టంలో కలిసి నడవాలన్నది సీతాతత్వం అన్నారు. శ్రీరాముడు కష్టాల్లో మనో నిబ్బరం కోల్పోకుండా ముందుకు సాగి విజయం సాధించారన్నారు. మానవ అవతారమూర్తులైన సీతారాములు ధర్మసంస్థాపనకు నిలువుటద్దంగా నిలిచారన్నారు. శ్రీరాముని అనుగ్రహంతో అన్నిరంగాల్లో పురోభివృద్ధిని సాధించాలన్నారు.

జూన్‌లో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ

- ఆధునిక టెక్నాలజీతో నిర్మాణం
- ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి


నర్మేటలో ఆయిల్ గెలలను పరిశీలిస్తున్న చైర్మన్ రాఘవరెడ్డి, అధికారులు

నంగునూరు(సిద్దిపేట): అత్యాధునిక టెక్నాలజీతో నంగునూరు మండలం నర్మేటలో నిర్మిస్తున్న ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని జూన్‌లో ప్రారంభిస్తామని తెలంగాణ ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా ములుగు, ఎల్లాయిగూడ, రంగ నాయకసాగర్‌లోని ఆయిల్‌పామ్ నర్సరీల స్థితిగతులను, పెంచుతున్న మొక్కలను పరిశీలించారు. సిద్దిపేట, జనగామ జిల్లాల వ్యాప్తంగా 30 వేల ఎకరాల్లో సాగు చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం నర్మేటలో నిర్మిస్తున్న ఫ్యాక్టరీని సందర్శించారు. వివిధ గ్రామాల నుంచి రైతులు తెచ్చిన ఆయిల్ గెలలను పరిశీలించి వారితో మాట్లాడారు. ఫ్యాక్టరీలో జరుగుతున్న నిర్మాణం పనుల పురోగతిపై ఆరా తీశారు. అనంతరం రాఘవరెడ్డి మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ సాగుకు జనగామ, సిద్దిపేట జిల్లాలోని భూములు అనువుగా ఉన్నాయని, పెద్ద ఎత్తున సాగు చేసేలా రైతులను ప్రోత్సహిస్తామన్నారు. చిన్న, చిన్న పనులను పూర్తి చేసి జూన్ నాటికి ఫ్యాక్టరీని ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆయన వెంట ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి, జనరల్ మేనేజర్ ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రాంకు ఘన నివాళి


బాబు జగ్జీవన్‌రాం విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, తదితరులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబుజగ్జీవన్‌రాం 118వ జయంతి ఉత్సవాలను సిద్దిపేటలో శనివారం ఘనంగా నిర్వహించారు. బీజేఆర్ చౌరస్తాలోని జగ్జీవన్‌రాం విగ్రహానికి జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ సుభాష్ చంద్రబోస్, అధికారులు, కాంగ్రెస్, బీజేపీ, ఉపాధ్యాయ, కులసంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అంతకు ముందు దళిత సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. జగ్జీవన్ ఆశయాలను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, డీఆర్‌ఓ నాగరాజమ్మ, ఎస్సీ అభివృద్ధి శాఖ జిల్లా అధికారి హమీద్, పెర్క పర్శరాములు, లింగంపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

దళిత సంఘాల నాయకుల నిరసన

డాక్టర్ బాబు జగ్జీవన్ రాం జయంతి ఉత్సవాలలో సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో స్థానిక మంత్రి, ఎమ్మెల్యే, ఎంపీ, కలెక్టర్, ఇతర జిల్లా స్థాయి నాయకులు పాల్గొనలేదని దళిత సంఘాల నాయకులు నిరసన తెలిపారు.

ఒకే తాటిపైకి రెవెన్యూ ఉద్యోగులు

- భూభారతితో రైతులకు మెరుగైన సేవలు
- త్వరలో అవుట్ సోర్సింగ్‌కు శుభవార్త
- ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి. లచ్చిరెడ్డి
- ఉమ్మడి మెదక్ జిల్లా రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం


ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న లచ్చిరెడ్డి

సిద్దిపేటఅర్బన్: రెవెన్యూ శాఖలోని ఉద్యోగులందరినీ ఒకే తాటిపైకి తీసుకొస్తామని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి అన్నారు. శనివారం సిద్దిపేటలో జరిగిన ఉమ్మడి మెదక్ జిల్లా రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం తెచ్చిన భూభారతి చట్టంతో రైతులకు మేలు జరుగుతుందని, రెవెన్యూ ఉద్యోగులకూ భరోసా ఉంటుందని చెప్పారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్న విశ్వాసం వ్యక్తం చేశారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు రెవెన్యూ వ్యవస్థ పునర్నిర్మాణం జరుగుతుందని చెప్పారు. అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఉద్యోగ భద్రతకు సంబంధించి త్వరలోనే ప్రభుత్వం శుభవార్త చెబుతుందని, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు సానుకూలంగా ఉందన్నారు. ఆప్షన్ల ద్వారా రెవెన్యూ శాఖల్లోకి వస్తున్న గ్రామ పరిపాలన అధికారులు (జీపీవో) సర్వీసుపరమైన అభద్రతకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. వీరందరికి కామన్ సర్వీస్, పదోన్నతులు ఉంటాయన్నారు. ప్రతి గ్రామానికి గ్రామ పరిపాలన అధికారిని నియమించడం వల్ల రైతులకు రెవెన్యూ సేవలు చేరువ కావడంతో పాటు ఉద్యోగులకు పెద్ద ఎత్తున పదోన్నతులు లభిస్తాయని ఆయన వివరించారు.

రెవెన్యూ ఉద్యోగులు పునరంకితం కావాలి

భూ సమస్యలు లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు రెవెన్యూ ఉద్యోగులు పునరంకితం కావాలని లచ్చిరెడ్డి పిలుపునిచ్చారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను క్రమంగా సాధించుకుంటున్నామని, సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల పోస్టులను సాధించామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. భూభారతి చట్టంతో తహసీల్దార్లకు, ఆర్డీఓలకు, అడిషనల్ కలెక్టర్లకు అధికారాల వికేంద్రీకరణ జరిగిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ బిల్లులకు త్వరలోనే మోక్షం లభిస్తుందని, సమస్యపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించినట్టు వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, కోశాధికారి వెంకట్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షులు చల్లా శ్రీనివాస్, టీజీటీఏ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రాములు, రమేష్, టీజీజీఏ జనరల్ సెక్రెటరీ ఫూల్‌సింగ్, టీ జీఆర్‌ఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బి.రాంరెడ్డి, భిక్షం, సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దర్శనం గౌడ్, టీజీటీఏ మహిళా విభాగం అధ్యక్షురాలు రాధ, సీసీఎల్ఏ అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణచైతన్య, రాంబాబు, కోశాధికారి మల్లేశం, టీజీఆర్‌ఎస్‌ఏ మహిళా విభాగం అధ్యక్షురాలు సుజాత చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

నాన్న తిడతాడనే భయంతో ఉరేసుకొని ఆత్మహత్య


సంజీవ్ (ఫైల్)

సిద్దిపేటరూరల్: ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని పుల్లూరు గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పుల్లూరుకు చెందిన కర్రె సంజీవ్(18) వారం రోజుల కిందట స్నేహితులతో కలిసి దొంగతనానికి పాల్పడ్డాడు. శనివారం మధ్యాహ్నం ఇంట్లో తండ్రి బాలయ్యతో కలిసి భోజనం చేసి పడుకుంటానని చెప్పి లోనికి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. కొద్దిసేపటికి ఇంటికి ఓ వ్యక్తి వచ్చి సంజీవ్ ఉన్నాడా.. అని తండ్రిని అడిగాడు. ఇంట్లో పడుకున్నాడని చెబుతూ గది తలుపులు తెరిచి చూడగా సంజీవ్ ఉరేసుకొని వేలాడుతూ కనిపించాడు. స్థానికుల సాయంతో కిందికి దింపి చూడగా అప్పటికే మృతి చెందాడు. సంజీవ్ దొంగతనం చేసిన విషయం చిన్న కుమారుడు తండ్రికి చెప్పాడు. నాన్న తిడతాడనే భయంతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని, తన కుమారుడి మరణంపై ఎలాంటి అనుమానం లేదని బాలయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇక ఆస్తుల విస్తీర్ణం డిజిటలైజేషన్

ఇళ్లు, స్థలాల వివాదాలకు చెక్

- సమస్త వివరాలతో ప్రాపర్టీ కార్డు
- మాస్టర్ ప్లాన్‌కు సులభతరం
- పారదర్శకంగా ఇంటి పన్నుల కుదింపు
- మున్సిపాలిటీకి పెరగనున్న ఆదాయం


సరిహద్దు సర్వే చేస్తున్న అధికారులు

హుస్నాబాద్: ఇక ముందు రెవెన్యూ రికార్డులు పక్కాగా, పారదర్శకంగా ఉండేలా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాజెక్టును రూపొందించింది. ఇళ్లు, భవనాలు, ఇతర నిర్మాణాలు, వివాద స్థలాలకు స్వస్తి పలికేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. డిజిటల్ ఇండియా ల్యాండ్స్ రికార్డ్స్ మాడర్నైజేషన్ ప్రోగ్రాంలో భాగంగా నేషనల్ జియో స్పేషియల్ నాలెడ్జ్ బేస్ట్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హ్యాబిటేషన్స్ (నక్షా) కార్యక్రమాన్ని చేపట్టింది. మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి ఇంటి, విస్తీర్ణాన్ని నక్షా సర్వేతో జల్లెడ పట్టి డిజిటల్ రూపంలో నిక్షిప్తం చేయనున్నారు. ప్రతి ఇంటి యజమానికి ఆస్తి హక్కును కల్పించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 10 మున్సిపాలిటీలను ఎంపిక చేయగా, అందులో సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మున్సిపాలిటీ ఉంది. హుస్నాబాద్‌లో మున్సిపల్ రికార్డుల ప్రకారం 7,343 ఇళ్లు ఉన్నాయి. నక్షా ఏరియల్ సర్వేతో ఆస్తుల విస్తీర్ణాన్ని డిజిటల్ పద్ధతిలో నమోదు చేయనున్నారు. బహుళ అంతస్తుల భవనాలు ఉండే పట్టణాలు, ఇరుకుగా ఉండే చోట్ల హెలికాప్టర్‌ను ఉపయోగించి వాటికి ప్రత్యేకమైన కెమెరాలను బిగించి సర్వే పూర్తి చేశారు. పట్టణంలో 48 చోట్ల సర్వే సరిహద్దులను ఏర్పాటు చేశారు. ఏరియల్ సర్వే ద్వారా పట్టణ విస్తీర్ణాన్ని నిర్ధారించి కచ్చిమైన పట్టణ మ్యాప్‌ను తయారు చేయనున్నారు. ప్రతి ఇంటికి త్రీడీ కెమెరాతో మ్యాపింగ్ చేస్తారు. ప్రస్తుతం మున్సిపల్ పరిధిలో విస్తృతంగా సర్వే చేస్తున్నారు.

మాస్టర్ ప్లాన్‌కు సులభతరం

మౌలిక వసతుల కల్పన, రోడ్లు, మంచి నీటి సౌకర్యం, ఇలా పలు అంశాల్లో పట్టణాన్ని అభివృద్ధి చేయాలంటే మాస్టర్ ప్లాన్ అవసరం. ప్రస్తుత నక్ష ప్రకారం ఇళ్లు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, రహదారులు, వ్యాపార, వాణిజ్య దుకాణాలు, ప్రైవేట్, ప్రభుత్వ స్థలాల ఆస్తుల లెక్కలు పక్కాగా తెలుస్తోంది. రెవెన్యూ, మున్సిపాలిటీ, సర్వే ఆఫ్ ఇండియా సంయుక్తంగా ఈ పైలెట్ ప్రాజెక్టును అమలు చేయనున్నారు. సర్వే కొనసాగిస్తున్న అధికారులు త్వరలోనే ఇంటింటికి తిరిగి ఇంటి ఆస్తుల వివరాలను పూర్తి స్థాయిలో సేకరించనున్నారు. సర్వే పూర్తి చేసిన తర్వాత ప్రాపర్టీ కార్డును జారీ చేయనున్నారు.

ప్రతి ఇంటి యజమానికి ప్రాపర్టీ కార్డు

ప్రస్తుతం ప్రతిదానికి ఆధార్ కార్డు కీలకంగా మారింది. ఆధార్ తరహాలోనే ఇంటి యజమానికి ప్రాపర్టీ కార్డు ఇవ్వబోతున్నారు. ఈ కార్డుపై క్యూఆర్ కోడ్ ఉంటుంది. స్కాన్ చేస్తే పూర్తి వివరాలు స్పష్టంగా తెలుస్తాయి. ఇంటి యజమాని పేరు, ఆస్తి పన్నుల వివరాలు, విస్తీర్ణం, భూముల సర్వే నంబర్లు, అనుమతి తీసుకున్న నంబర్, ప్లాన్, నల్లా కనెక్షన్ ఇలా పూర్తి స్థాయి వివరాలు ప్రాపర్టీ కార్డులో ఉంటుంది.

ఆస్తి పన్నుల లెక్కా పక్కా

నక్షా సర్వే ద్వారా ప్రతి ఇంటి ఆస్తి వివరాలు గుర్తిస్తారు. ప్రస్తుతం ఒక ఇంటి (గ్రౌండ్ ఫ్లోర్)అనుమతితో రెండు, నుంచి మూడు ఫ్లోర్లు వేస్తున్నారు. మున్సిపల్ రికార్డులో ఎన్ని అంతస్తులు ఉన్న ఒక ఇంటికే పన్ను వసూలు చేస్తున్నారు. దీంతో మున్సిపల్ ఆదాయానికి గండికొడుతున్నారు. ప్రస్తుతం ఏడాది ఇంటి పన్నుల వసూళ్లు రూ.1.72 కోట్లు ఉండగా, ఈ సర్వేతో ఆదాయం రెట్టింపు కానుంది. ఈ సర్వే ద్వారా బహుళ అంతస్తుల లెక్క తేలుతుంది. ఆస్తి పన్నును మదింపు చేసుకొని ఆదాయాన్ని పెంచుకునే అవకాశం ఉంటుంది.

సర్వేతో పట్టణ సమగ్ర ప్రణాళిక



నక్షా సర్వేతో పట్టణ సమగ్ర ప్రణాళిక రూపొందుతుంది. ప్రతి ఇంటి ఆస్తి హద్దులు నిర్ణయిస్తాం. యజమానికి ఆస్తి హక్కును కల్పిస్తాం. మౌలిక సదుపాయాల కల్పనకు ఎంతగానో దోహదపడుతుంది. ఆస్తి పన్నుల నిర్ణయంతో పారదర్శకంగా ఆదాయాన్ని పెంచుకునే వీలు ఉంటుంది. ప్రతి ఇంటికి ప్రాపర్టీ కార్డును జారీ చేయనున్నాం. ఈ కార్డుతో రుణాలు పొందవచ్చు.

- మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్

క్లుప్తంగా

అణగారిన వర్గాల ఆత్మబంధువు బాబూ జగ్జీవన్ రామ్

● టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నరేందర్



జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మెదక్‌జోన్ : అణగారిన వర్గాల ఆత్మబంధువు బాబూ జగ్జీవన్ రామ్ అని టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు నరేందర్ ఉద్ఘాటించారు. శనివారం స్థానిక టీఎన్‌జీవో భవన్‌లో నిర్వహించిన జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల్లో పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. భారత ప్రభుత్వంలో వ్యవసాయ శాఖ, కార్మిక శాఖ, రక్షణ శాఖ, భారత ఉప ప్రధానిగా పలు మంత్రిత్వ శాఖలు నిర్వహించి దేశ అభ్యున్నతికి నూతన సంస్కరణలు చేపట్టి ఘనత ఆయనకే దక్కిందన్నారు. విద్యార్థి దశ నుంచే సామాజిక దృక్పథంతో కుల వివక్షకు వ్యతిరేకంగా సమాజాన్ని చైతన్య పరిచే అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షుడు ఎండీ ఇక్బాల్ పాషా, కోశాధికారి ఎం.చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శి శివాజీ, సంతోష్ , తదితరులు పాల్గొన్నారు.

మహిళపై అత్యాచారం, హత్యాయత్నం కేసులో..

● నిందితుడి అరెస్ట్



మాట్లాడుతున్న సీఐ అనిల్‌కుమార్

జోగిపేట(అందోల్): మహిళపై అత్యాచారయత్నం, హత్యాయత్నం కేసులో ఒకరిని అరెస్టు చేసినట్లు సీఐ అనిల్ కుమార్ తెలిపారు. శనివారం విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఏర్పుల అనిత అనే మహిళ కొద్ది రోజులుగా భర్తతో గొడవపడి అమ్మవారి ఇంట్లోనే తన పిల్లలతో గోంగులూరు తండాలోనే ఉంటూ సంగారెడ్డిలో కూలీగా పని చేస్తూ జీవనం సాగిస్తుంది. మిన్పూర్‌కు చెందిన ఆంజనేయులుతో కూలీ పని వద్ద పరిచయం ఏర్పడింది. 2న ఆంజనేయులు కూలీ పని ఉందని అనితకి ఫోన్ చేయడంతో ఆమె చౌటుకూరు బస్టాప్ వద్దకు వచ్చింది. బైక్‌పై ఎక్కించుకొని పోసానిపల్లి– బొమ్మరెడ్డిగూడెం మధ్యలోని అడవి ప్రాంతంలోకి తీసుకెళ్లి అత్యాచారయత్నం చేయబోతుండగా ప్రతిఘటించింది. పెనుగులాటలో నిందితుడు ఆమెపై కత్తితో దాడి చేయడంతో మెడపై గాయమైంది. అక్కడి నుంచి పరిగెత్తుకుంటూ పోసానిపల్లి రోడ్డు పైకి వచ్చి పెద్దగా అరవడంతో చుట్టుపక్కల వారు వచ్చి కాపాడారు. ఆంజనేయులు ఆమె ఫోన్‌ను తీసుకొని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన శనివారం నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు,

ఏజెన్సీపై కేసు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున ఆలయంలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బంది వేతనాలకు సంబంధించి రూ.28 లక్షల మేర జీఎస్టీ, పీఎఫ్, ఈఎస్ఐ డబ్బులు చెల్లించకుండా స్వాహా చేసిన హిమాన్స్ సీఆర్ ఎం సర్వీసెస్ ఏజెన్సీపై గతంలో ఆలయ ఈవో రామాంజనేయులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం ఆలయ అధికారులతో విచారణ చేసి అవుట్ సోర్సింగ్ ఏజెన్సీపై కేసు నమోదు చేసినట్లు చేర్యాల సీఐ శ్రీను తెలిపారు.

ఆరేళ్ల కిందట అదృశ్యం.. నేడు పోలీసులకు ఫిర్యాదు

● ఏడేళ్ల వరకు ఆచూకీ దొరక్కపోతే డెత్ సర్టిఫికేట్ వచ్చే అవకాశం!



సాయవ్వ

కల్హేర్(నారాయణఖేడ్): వృద్ధురాలు అదృశ్యం కావడంతో కేసు నమోదు చేసినట్లు సిర్గాపూర్ ఎస్ఐ డీ.వెంకటరెడ్డి శనివారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. సిర్గాపూర్ మండలం పోట్‌పల్లికు చెందిన శరద సాయవ్వ ఆరేళ్ల కిందట ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆమె భర్త శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా అదృశ్యమైన సమయం నుంచి ఏడేళ్ల వరకు ఆచూకీ లభించకపోవడంతో ఎఫ్ఐఆర్ సమర్పించి డెత్ సర్టిఫికెట్ పొందే అవకాశం ఉంటుంది. సాయవ్వ పేరు మీద వ్యవసాయ భూమి ఉంది. దీంతో ఆలస్యంగా ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

ఆట పూట మారిందోచ్

సంగారెడ్డిలో వెలుస్తున్న బాక్స్ గ్రౌండ్‌లు

- ఫ్లడ్ లైట్ల వెలుగుల్లో ఆటలు
- ఆసక్తి చూపుతున్న యువత, ఉద్యోగులు
- అన్ని వయస్సుల వారు ఇష్టంగా ఆడుతున్న క్రికెట్
- ఆట సమయాన్ని బట్టి ధరలు
- రూ.లక్షలు ఖర్చు పెట్టి ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులు
- అన్ని క్రీడలకు అవకాశం



రాత్రిపూట క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

సంగారెడ్డి టౌన్: మన దేశంలో క్రికెట్‌కు ఉన్న క్రేజ్ అంతా ఇంతా కాదు.. ఖాళీ సమయం దొరికితే చాలు క్రికెట్ ఆడుతుంటారు. అప్పట్లో ఆటలు ఆడేందుకు గ్రామాల్లో, పట్టణాల్లో పెద్ద పెద్ద మైదానాలు ఉండేది. కానీ రాను రానూ గ్రామాలతో పాటు పట్టణాల్లో స్థలాల విలువ పెరగడం ఆట స్థలాలు లేకుండా పోయాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా మైదానాలు కనుమరుగవుతుండటంతో పిల్లల చేతుల్లోకి స్మార్ట్ ఫోన్ వచ్చి చేరింది. ఇప్పుడు ఏ ఇంట్లో చూసినా ప్రతీ పిల్లవాడి చేతిలో ఫోన్ ఉండాల్సిందే. యూట్యూబ్ చూడటం, ఫోన్ లోనే ఆటలు ఆడడమే తప్ప శరీరానికి ఉపయోగపడే ఆటలు ఆడటం మరచిపోయారు. దీన్ని దృష్టిలో సంగారెడ్డిలో కొందరు అన్ని వసతులు, ఆహ్లాదకర వాతావరణంలో బాక్స్ క్రికెట్ మైదానాలు ఏర్పాటు చేశారు. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరికీ వెసులుబాటు ఉండేలా నిర్మాణాలు చేపట్టారు.

క్రికెట్‌కు ప్రత్యేకంగా కోచింగ్

ప్రస్తుతం వేసవి కావడం, ఇంటర్ కళాశాలల విద్యార్థులకు సెలవులు రావడం, ఒంటిపూట బడులు ఉండటంతో ఇప్పుడూ ఎక్కడ చూసిన క్రికెట్ సందడి నెలకొంది. దీంతో జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో క్రికెట్‌కు ప్రత్యేకంగా కోచింగ్ ఇచ్చేందుకు నెట్ ప్రాక్టీస్ శ్రీకారం చుట్టారు. ఉదయం, సాయంత్రం వేళలో ఫ్లడ్ లైట్ల వెలుతురులో కోచింగ్ ఇస్తున్నారు. ఇందులో భాగంగా సంగారెడ్డితోపాటు పటాన్ చెరు పరిసర ప్రాంతాల్లో బాక్స్ క్రికెట్‌లు ఏర్పాటు చేశారు. తల్లిదండ్రులు కూడా తమ చిన్నారులను సాయంత్రం వేళల్లో కోచింగ్ ఇప్పించేందుకు ఎక్కువ ఆసక్తి కనబరుస్తున్నారు. ఉద్యోగులు తమ పిల్లలకు శిక్షణ ఇప్పించేందుకు సమయం వెచ్చిస్తున్నారు.

12 బాక్స్ క్రికెట్ గ్రౌండ్‌లు

సంగారెడ్డి చుట్టపక్కల సుమారు 12 బాక్స్ క్రికెట్ గ్రౌండ్ లు ఉన్నాయి. ప్రస్తుతం ఎండా కాలం కావడంతో రాత్రి 11 వరకు ఉదయం 5 నుంచి 7 వరకు ఆడుతున్నారు. బాక్స్ క్రికెట్ లో చుట్టూ నెట్ ఏర్పాటు చేస్తారు. గ్రౌండ్‌లో కింద గ్రీన్ మ్యాట్‌తో ఉంటుంది. ప్రతీ క్రికెట్ ఆటకు నెలకు రూ.700 నుంచి రూ.900, వాలీబాల్‌కు రూ. 600 నుంచి రూ.750 ఒక ఆటకు, స్నూకర్ రూ.150 నుంచి 250, బ్యాడ్మింటన్ రూ.250 నుంచి రూ.300 ధరలు ఉన్నాయి.

వీకెండ్లలో యువకులు పెద్ద ఎత్తున

సంగారెడ్డితోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి వీకెండ్లలో యువకులు పెద్ద ఎత్తున వస్తుంటారు. నర్సాపూర్, జోగిపేట్, శివ్వంపేట్, తదితర గ్రామాల నుంచి క్రీడాకారులు డాక్టర్లు, ఉద్యోగులు, క్రికెట్‌తోపాటు వివిధ ఆటలు ఆడడానికి వస్తుంటారు. సాయంత్రం వేళలో సంగారెడ్డి చుట్టుపక్కల ఉన్న గ్రౌండ్‌లను ముందుగా బుకింగ్ చేసుకొని ఆటలు ఆడుతుంటారు. వీకెండ్లలో స్నేహితులందరూ ఒకచోట చేరి క్రికెట్ ఆడుతుంటారు. జిల్లా అధికారులు, రిటైర్డ్ ఉద్యోగులు సాయంత్రం వేళల్లో ఆడటానికి ఆసక్తి చూపుతున్నారు.



బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు



స్నూకర్ ఆడుతున్న ఆటగాడు

గంటకు రూ.700 నుంచి రూ.900

సంగారెడ్డిలో క్రికెట్ కాకుండా స్నూకర్, బ్యాడ్మింటన్ ఆడేందుకు ప్రత్యేకంగా నెట్ ప్రాక్టీస్ కేంద్రాలను నెలకొల్పారు. ఒకేసారి ఒక క్రికెట్ టీమ్ (12) మంది ఆడేందుకు వీలుగా గ్రౌండ్‌ను ఏర్పాటు చేశారు. వేసవిలో ఈ ప్రాక్టీస్ కేంద్రాల్లో సాయంత్రం 3 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు కోచింగ్ ఇస్తున్నారు. క్రికెట్ ఆడుకునేవారి కోసం రాత్రివేళల్లో వెలుతురులో ప్రాక్టీస్ చేసుకునేందుకు సాయంత్రం 7 గంటల నుంచి 11 గంటల వరకు అవకాశం కల్పిస్తున్నారు. ఇలా ఒక జట్టుకు గంటకు రూ.700 నుంచి 900 వరకు చెల్లిస్తున్నారు.

చిన్నప్పటి నుంచి క్రికెట్ ఇష్టం



చిన్నప్పటి నుంచి క్రికెట్ అంటే ఎంతో ఇష్టం. రోజంతా పనిలో ఉండి ఆడలేక పోయేవాళ్లం. మళ్లీ క్రికెట్ ఆడటం వీలు కాదనుకున్నా. కానీ సంగారెడ్డిలో బాక్స్ క్రికెట్ స్టేడియంలు ఏర్పాటు చేయడం సంతోషకరం. రాత్రి వేళలో బాక్స్ క్రికెట్ ఆడుతుంటాం. ఫ్లడ్ లైట్లను ఏర్పాటు చేశారు. ఆటలు మానవ శరీర ఆరోగ్యానికి ఎంతో అవసరం, అందరూ సమయం దొరికినప్పుడు ఏదో ఒక ఆటని ఆడే అలవాటు చేసుకోవాలి.

– షాబుద్దీన్, క్రికెట్ క్రీడాకారుడు

రోజూ సాయంత్రం వస్తుంటాం



ప్రతీ రోజూ బ్యాడ్మింటన్ ఆడతాను. ఇది శరీరాన్ని ఆరోగ్యంగా, చురుకుగా ఉంచుతుంది. రెండు గంటలు ఆడటం వల్ల ఒత్తిడి తగ్గుతుంది , నను సంతోషంగా ఉంటుంది. అలాగే, ఇది ఒక సరదా ఆట కాబట్టి నాకు ఆనందంగా గడుస్తుంది. ప్రతి రోజూ సాయంత్రం వేళలో ఆడుతుంటాం.

– శ్రీకాంత్ ప్రైవేట్ ఉద్యోగి, సంగారెడ్డి

ప్రతీ వీకెండ్‌లో వెళ్తుంటాం



సెలవులు దొరికినప్పుడల్లా సమయం చూసుకొని క్రికెట్ ఆడటానికి వెళ్తుంటాం. ఆఫీసులో పని ఒత్తిడి ఉండటంతో కొంత ఉపశమనం పొందుతాం. ప్రతీ వారం సమయం కేటాయించి కచ్చితంగా వెళ్తుంటాం. స్నేహితులమందరం ఒక చోటు చేరడం టీమ్‌లుగా పంచుకోవడం మంచి సంతోషాన్ని ఇస్తుంది.

– శ్రీ నికేతన్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

సుమారు రూ.15 లక్షల ఖర్చు



బాక్స్ క్రికెట్ ఏర్పాటు చేయడం ఖర్చుతో కూడుకున్న పని. సుమారు రూ.15 లక్షల వరకు ఖర్చు వచ్చింది. సాధారణ రోజుల కంటే వీకెండ్‌లలో ఎక్కువగా వస్తుంటారు. క్రికెట్‌తో పాటు బ్యాడ్మింటన్, వాలీబాల్, ఫుట్ బాల్ , స్నూక్కర్ ఆడుకోవడానికి సౌకర్యం ఉంది. దూర ప్రాంతాల నుంచి రాత్రి సమయాల్లో ఆటలు ఆడుతున్నారు. మంచి లాభాలు పొందుతున్నాం.

– ఆసిఫ్, బాక్స్ క్రికెట్ నిర్వాహకుడు

బైక్‌లు చోరీ చేసి.. ఫోర్జరీ పత్రాలు సృష్టించి

● ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

● రెండు బైక్‌లు, కంప్యూటర్, ప్రింటర్ స్వాధీనం



నిందితులను చూపుతున్న సీఐ ఉపేందర్

సిద్దిపేటకమాన్: బైక్‌లను దొంగతనం చేస్తున్న వ్యక్తిని, అతడికి సహకరిస్తూ దొంగ బైక్‌లకు ఫోర్జరీ కాగితాలు సృష్టిస్తున్న మరో వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. టూ టౌన్ సీఐ ఉపేందర్ కథనం మేరకు.. సిద్దిపేట కేసీఆర్ నగర్ దక్కల కాలనీలో నివాసం ఉంటున్న ఓర్సు కృష్ణ ద్విచక్ర వాహనాలు దొంగిలిస్తూ అమ్మేవాడు. వచ్చిన డబ్బులతో జల్సాలు చేసేవాడు. అలాగే దొంగిలించిన బైక్‌లకు సిద్దిపేట కేసీఆర్ నగర్‌కు చెందిన బండ్లగుండ్ల నాగరాజు ఒరిజినల్ పత్రాలు పోలే విధంగా ఫోర్జరీ డాక్యుమెంట్లు, బైక్ ఆర్‌సీలను సృష్టించి కృష్ణకు సహకరించేవాడు. ఇలా ఇద్దరూ బైక్ దొంగతనాలు మొదలు పెట్టారు. కొద్ది రోజుల కిందట పట్టణంలోని ఆదర్శనగర్‌కు చెందిన బాబు అనే వ్యక్తి తన ఇంటి ఎదుట పార్క్ చేసిన బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. దీంతో టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తులో భాగంగా సీఐ ఉపేందర్ ఆధ్వర్యంలో సిబ్బంది కనకరాజు, సుధాకర్‌రెడ్డి, ప్రశాంత్ రెడ్డి శనివారం కరీంనగర్ రోడ్డు మార్కెట్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. పోలీసులను చూసి కృష్ణ, నాగరాజు పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నారు. ఇద్దరినీ అదుపులోకి తీసుకొని విచారించగా వారు చేస్తున్న దొంగతనాలు, నేరాలు ఒప్పుకున్నారు. నిందితుల నుంచి రెండు ద్విచక్ర వాహనాలు, ఫోర్జరీ కాగితాలను తయారు చేయడానికి వినియోగించిన కంప్యూటర్, ప్రింటర్, సీపీయూ, ఫోర్జరీ పత్రాలు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

జిన్నారం (పటాన్ చెరు): చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి చెందిన ఘటన కొడకంచి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ నాగలక్ష్మి కథనం మేరకు.. గ్రామానికి చెందిన కంచనపల్లి ఆంజనేయులు (49) పుట్టగూడ సమీపంలోని చెరువులో చేపలు పట్టేందుకు శుక్రవారం వెళ్లాడు. చేపలు పట్టే క్రమంలో కాళ్లకు వల చుట్టుకోవడంతో ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. వేటకు వెళ్లిన ఆంజనేయులు తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. ఆచూకీ కోసం మత్స్యకారులు గ్రామస్తులతో కలిసి చెరువులో గాలించగా మృతదేహం బయటపడింది. పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి కుమారుడు జితేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి..



మృతి చెందిన పోచయ్య

కొల్చారం(నర్సాపూర్): విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని వరిగుంతం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. కొల్చారం ఎస్ఐ మహమ్మద్ గౌస్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన బాలయ్య వాళ్ల పోచయ్య(39) సెంట్రింగ్ మేస్త్రీగా పని చేస్తున్నాడు. గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఇంటికి నీళ్ల పట్టేందుకని వెళ్తున్నానని భార్య చంద్రకళకు చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. కొద్దిసేపటికి నీళ్ల పడుతున్న క్రమంలో పోచయ్య చేయి ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న విద్యుత్ తీగలకు తగిలింది. దీంతో కరెంట్ షాక్ కొట్టి కిందపడిపోయాడు. వెంటనే మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.

కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వడదెబ్బతో ఉపాధి హామీ కూలీ



శంకర్(ఫైల్)

వెల్దుర్తి(తూప్రాన్) : ఉపాధి హామీ కూలీ మృతి చెందిన ఘటన మండలంలోని శంశిరెడ్డిపల్లి తాండా పంచాయతీ పరిధి బండమీదిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన పిట్టల శంకర్ కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజూ మాదిరిగా శనివారం గ్రామ శివారులో జరిగిన ఉపాధి హామీ పనులకు వెళ్లి ఉదయం 11 గంటల ప్రాంతంలో ఇంటికి చేరుకున్నాడు. కొద్ది సేపటికే అస్వస్థతకు గురి కావడంతో వెల్దుర్తిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి తిరిగి ఇంటికి తీసుకెళ్లే క్రమంలో మృతి చెందాడు. వడదెబ్బ సోకడంతోనే అస్వస్థతకు గురై మృతి చెంది ఉంటాడని కుటుంబసభ్యులు, గ్రామస్తులు భావిస్తున్నారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ..

గజ్వేల్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ శివారులో రింగురోడ్డుపై శనివారం చోటు చేసుకుంది. గజ్వేల్ పోలీసుల కథనం మేరకు.. జగదేవ్‌పూర్ మండలం చాట్లపల్లిలోని ఓ పౌల్ట్రీ ఫాంలో వాచ్‌మెన్‌గా పని చేసే ఎలుక గోపిరెడ్డి(75) ఆర్‌వీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భార్య సత్తమ్మను చూసేందుకు స్కూటీపై మనుమడు కార్తీక్‌రెడ్డితో కలిసి బయలుదేరాడు. ప్రజ్ఞాపూర్ శివారులో రింగురోడ్డుపై ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న గోపిరెడ్డి ముందు వెళ్తున్న లారీని తప్పించబోయి డివైడర్‌ను ఢీకొట్టాడు. తీవ్ర గాయాలైన గోపిరెడ్డిని 108 వాహనంలో ప్రజ్ఞాపూర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యం

శనివారం వేర్వేరు చోట్ల మహిళ, యువకుడు, వృద్ధురాలు అదృశ్యమయ్యారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భర్తతో గొడవ పడి భార్య



సుగుణమ్మ

సంగారెడ్డి క్రైమ్: ఇంటి నుంచి వెళ్లి మహిళ అదృశ్యమైన ఘటన పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ రమేశ్ కథనం మేరకు.. పట్టణంలోని భగత్‌సింగ్ నగర్‌కు చెందిన కుమ్మరి నారాయణ, సుగుణమ్మ(40) దంపతులు. కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నారు. 20 రోజుల కిందట దంపతుల మధ్య గొడవ జరగడంతో మనస్తాపానికి గురైన మహిళ గత నెల 31న ఇంటి నుంచి వెళ్లిపోయింది. చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

పని ఉందని వెళ్లి యువకుడు

గజ్వేల్‌రూరల్: పని ఉందని బయటకి వెళ్లి యువకుడు అదృశ్యమైన ఘటన మండల పరిధిలోని అహ్మదీపూర్‌లో చోటు చేసుకుంది. గజ్వేల్ పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన చాడ మల్లారెడ్డి(28) 4న హైదరాబాద్‌లో పని ఉందని కుటుంబ సభ్యులకు చెప్పి ఇంటి నుంచి బైక్‌పై వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. తెలిసిన చోట, బంధువుల వద్ద వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. శనివారం బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు పోలీసులు కేసు నమోదు చేశారు.

మద్యం మత్తులో ఉరేసుకొని ఆత్మహత్య



స్వామి (ఫైల్)

తొగుట(దుబ్బాక): మద్యం మత్తులో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్ఐ రవికాంత్‌రావు కథనం మేరకు.. తొగుట గ్రామానికి చెందిన మేకల స్వామి (39) మద్యానికి బానిసయ్యాడు. భార్య లక్ష్మీ ఎన్నిమార్లు చెప్పినా వినిపించుకోకుండా రోజూ మద్యం సేవించేవాడు. శనివారం మధ్యాహ్నం మద్యం తాగి ఇంటికొచ్చాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి ఎదుట రేకుల గదిలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చిరుత కలకలం



పాపన్నపేట(మెదక్): పాపన్నపేట మండల పరిధిలోని దౌలాపూర్ గ్రామ శివారులో చిరుత సంచారం కలకలం రేపింది. రైతు పిల్లుట్ల జాన్సన్ కథనం మేరకు.. శనివారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో తన తల్లి మంజులతో కలిసి పొలం నుంచి ఇంటికి వస్తుండగా జానకీసాగర్ కుంట వైపు వెళ్లే బ్రిడ్జి దగ్గర చెట్టు కింద చిరుత నిద్రిస్తుంది. బైక్ శబ్దం విని లేవడంతో తాము భయపడి వేగంగా ఇంటికి వచ్చామన్నారు. అనంతరం గ్రామస్తులకు విషయం చెప్పాం. అక్కడకు వెళ్లి చూడగా చిత్తడి నేలలో చిరుత అడుగులు పోలిన గుర్తులు కనిపించాయి. విషయాన్ని ఫారెస్ట్ అధికారులకు చెప్పడంతో అటవీ ప్రాంతం వైపు వెళ్లకూడదని సూచించినట్లు తెలిపారు. ఫారెస్ట్ వాచర్ భవానీ ప్రసాద్ మాట్లాడుతూ.. తాము ఘటనా స్థలికి వెళ్లి పరిశీలించగా అడుగుల గుర్తులు చిరుతను పోలి ఉన్నాయని చెప్పారు. పరిసరాలను గమనించగా అడవిలోని కొద్ది దూరంలో చిరుత కళ్లలా కనిపిస్తున్నాయని తెలిపారు. ఉదయం వరకు చిరుత అక్కడి నుంచి వెళ్లకుంటే బోనును ఏర్పాటు చేసి పట్టుకుంటామన్నారు.

తప్పిపోయిన బాలిక తల్లిదండ్రుల చెంతకు



పాపను తండ్రికి అప్పగిస్తున్న పోలీసులు

జిన్నారం (పటాన్‌చెరు): అదృశ్యమైన బాలికను కనుగొని గంట వ్యవధిలోనే పోలీసులు తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. వివరాల్లోకి వెళ్తే.. గుమ్మడిదల మండలం దోమడుగు గ్రామానికి చెందిన ఆకుల ప్రణవి (6) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో రెండో తరగతి చదువుతోంది. శనివారం పాఠశాలకు సెలవు రోజని మర్చిపోయి తల్లిదండ్రులు రోజు మాదిరిగానే బడికి పంపారు. ఈలోగా పాఠశాల లేదని తెలియడంతో తల్లిదండ్రులు స్కూలుకు వెళ్లగా కూతురు ప్రణవి కనిపించలేదు. ఆందోళన చెందిన వారు పోలీసులను ఆశ్రయించారు. ఎస్సై మహేశ్వర్ రెడ్డి నలుగురు సిబ్బందితో సుమారు గంట పాటు దోమడుగు గ్రామంలో వెతకగా ప్రణవి ఓ చోట ఆడుకుంటూ కనిపించింది. వెంటనే పాపను సంరక్షించి తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసులకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

బంగారం దుకాణంలో చోరీ

నిజాంపేట(మెదక్): బంగారు దుకాణంలో చోరీ జరిగిన ఘటన నిజాంపేట మండల పరిధిలోని కె.వెంకటాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన బోర్రోజు బాలచంద్రం అలియాస్ శేఖర్ తన బంగారు దుకాణంను శుక్రవారం సాయంత్రం తాళం వేసి సిద్దిపేటలోని ఇంటి వెళ్లాడు. తిరిగి శనివారం ఉదయం దుకాణం ముందు పని చేసే మహిళ వచ్చి చూసేసరికి తాళం పగుల గొట్టి ఉంది. వెంటనే బాలచంద్రంకు సమాచారం ఇచ్చారు. అతడు వచ్చి చూసుకునే సరికి టేబుల్ డ్రాలో ఉన్న వెండి 76తులాలు, 4 గ్రాముల బంగారం అపహరించిన్నట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ వెంకట రాజాగౌడ్ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో ..

దుబ్బాకటౌన్ : తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన రాయపోల్ మండలం అనాజీపూర్ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అనాజీపూర్ గ్రామానికి చెందిన మత్తుగల్ల నర్సింలు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. రోజులాగే శనివారం ఉదయం వ్యవసాయ పనుల నిమిత్తం ఇంటికి తాళం వేసి వెళ్లాడు. గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలోని రూ.50 వేలు నగదు ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న పోలీసులు క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరించారు. బాధితుడు నర్సింలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రఘుపతి తెలిపారు.

బావ బామ్మర్దుల మృతదేహాలు లభ్యం



నవీన్ కుమార్, ప్రేమ్ కుమార్ మృతదేహాలు

హత్నూర(సంగారెడ్డి): ప్రమాదవశాత్తు నీట మునిగి గల్లంతైన ఇద్దరి యువకుల మృతదేహాలు శనివారం లభించాయి. పోలీసుల కథనం మేరకు.. హత్నూర మండలం బోర పట్ల గ్రామ శివారులోని భీముని చెరువులో శుక్రవారం గ్రామానికి చెందిన దప్పు నవీన్ కుమార్, కొండాపూర్ మండలం మల్కాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని షాహిపేట గ్రామానికి చెందిన ప్రేమ్ కుమారు గల్లంతైన విషయం తెలిసిందే. రెండు రోజులుగా మృతదేహాల కోసం మత్స్యకారులు అధికారులు భీముని చెరువు వద్ద గాలిస్తున్నారు. శనివారం ఎట్టకేలకు రెండు మృతదేహాలు లభించడంతో బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వరసకు బావ బామ్మర్దిలిద్దరూ మృతి చెందడంతో రెండు కుటుంబాల్లో విషాదం చోటుచేసుకుంది.

ప్రజలకు చేరువలో న్యాయస్థానాలు

- పెండింగ్ కేసుల పరిష్కారానికి న్యాయవాదులు సహకరించాలి
- హైకోర్టు న్యాయమూర్తులు
- జహీరాబాద్‌లో అదనపు జూనియర్ సివిల్ కోర్టు ప్రారంభం



కోర్టును ప్రారంభిస్తున్న న్యాయమూర్తులు శ్రీసుదా, అనిల్‌కుమార్, కలెక్టర్ క్రాంతి, ఎస్పీ పరితోష్ పంకజ్, జిల్లా జడ్జి భవానీ చంద్ర, తదితరులు

జహీరాబాద్ టౌన్: ప్రజలకు చేరువలో న్యాయస్థానాలు ఉండాలని, పెండింగ్ కేసుల పరిష్కారానికి న్యాయవాదులు సహకరించాలని హైకోర్టు న్యాయమూర్తులు అన్నారు. జహీరాబాద్‌లో ఏర్పాటు చేసిన అదనపు జూనియర్ సివిల్ కోర్టును హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ శ్రీసుదా, జస్టిస్ అనిల్ కుమార్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ.. బార్ అసోసియేషన్ నాయకులు ఇచ్చిన వినతిపత్రానికి స్పందించిన న్యాయమూర్తులు ప్రభుత్వ స్థలం లభిస్తే కోర్టులన్నీ ఒకే చోట ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. కలెక్టర్ వల్లూర్ క్రాంతి మాట్లాడుతూ.. బార్ అసోసియేషన్ కోరిక మేరకు వాహనాల పార్కింగ్ స్థలం కోసం చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా జడ్జి భవానీ చంద్ర, ఎస్పీ పరితోష్ పంకజ్, జహీరాబాద్ సీనియర్ సివిల్ జడ్జి సూరి కృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్, ఏజీపీ దత్తాత్రేరెడ్డి, న్యాయవాదులు పాండురంగా రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నతానీయల్, గోపాలకృష్ణ, అనుషా, నరేశ్, శశికాంత్, మానెన్న, ఆర్డీఓ రాంరెడ్డి, తహసీల్దార్ దశరథ్ జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, పలు కోర్టుల న్యాయమూర్తులు, పోలీసు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.